క్లుప్తంగా

సైన్స్‌తోనే ప్రగతి



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మల్కాపురం: కోరమాండల్ సంస్థ ఆవరణలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ను ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్ ప్రారంభించారు. పారిశ్రామిక ప్రాంతం నలుమూల నుంచి పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వివిధ రకాలు నమూనాలు ఏర్పాటు చేశారు. స్టాల్స్‌ను కోరమాండల్ అధికారులు తిలకించి అభినందించారు.కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (సోషల్ వెల్ఫేర్) రామరావు, కోరమాండల్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రేవతి

విశాఖ విద్య: వైద్య సేవలను ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతి అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రేవతి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకాని నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, లలిత, రాణి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

మల్కాపురం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో 59వ వార్డు నెహ్రూనగర్ లేబర్ జంక్షన్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మల్కాపురం జోన్ అధ్యక్షులు రామునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని, 1214 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



భద్రత పరిచయ కరదీపికను ఆవిష్కరిస్తున్న జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్

పరవాడ: పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో 53వ జాతీయ భద్రత వార్షికోత్సవాలను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన ప్రణాళిక సమావేశానికి శివశంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రత పరిచయ కరదీపిక పుస్తకాన్ని జేఎఫ్‌సీ శివశంకర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రత పరిచయ కరదీపిక పుస్తకాలను ఫార్మా పరిశ్రమ ఉద్యోగులకు అందించడం జరుగుతుందని చెప్పారు. వీటిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వి.సురేష్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నారావు, ఆర్.వి.రమణ, జాతీయ భద్రత మండలి ఏపీ చాంబర్ వైస్ ప్రెసిడెంట్(లారస్ ల్యాబ్స్) ఎస్.ఎస్.రావు, పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎంఎస్ఆర్ఎం అధ్యక్షుడు జెట్టి సుబ్బారావు, ఎస్ఈజెడ్ భద్రత విభాగం అధికారులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాల పండగకు వేళాయె

- పశ్చిమ నియోజకవర్గంలో 5,126 టిడ్కో ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు
- సామూహిక గృహ ప్రవేశాల నిర్వహణకు ఆడారి సొంత నిధులు
- టిడ్కో గృహాల లబ్ధిదారుల్లో వెల్లువెత్తిన ఆనందోత్సవాలు
- నియోజకవర్గంలో మూడు ప్రాంతాల్లో రేపు ప్రారంభోత్సవాలకు సన్నాహాలు



పద్మనాభనగర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయాలు



నూతనంగా వేసిన సీసీరోడ్డు

గోపాలపట్నం: ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కల నెరవేరబోతోంది. పశ్చిమ నియోజకవర్గంలో శనివారం నిర్వహించే 5,126 టిడ్కో గృహాల ప్రవేశాల పండగకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సామూహిక గృహ ప్రవేశాల అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం , మధ్యాహ్నం బంధువులకు భోజనాలు వంటి కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో ఏర్పాట్లు చేస్తున్నారు.

95 శాతం పూర్తయిన పనులు

నియోజకవర్గంలో మూడు ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి మధ్యలో నిలిపేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఇళ్ల నిర్మాణాలను తిరిగి ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులు చురుగ్గా సాగడంతో 95 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేశారు.



అచ్చినాయుడులోవ కొండ ప్రాంతం వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టిడ్కో ఇళ్లు

పూర్తయిన రిజిస్ట్రేషన్లు

ఇప్పటికే చాలా మందికి బ్యాంక్ రుణాలు, రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఈ నెల 2(శనివారం)న లాంఛనంగా సామూహిక గృహ ప్రవేశాలు చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో టిడ్కో గృహాల లబ్ధిదారుల సామూహిక గృహ ప్రవేశాలు చేయనున్నారు. లబ్ధిదారులకు పట్టువస్త్రాలు అందజేసి, సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గృహ ప్రవేశాలకు హాజరైన వారంతా మధ్యాహ్నం భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు.

సదుపాయాలు..

టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద సకల మౌలిక

పద్మనాభనగర్‌లో..	
300 చదరపు గజాల ఫ్లాట్లు	48
365 చదరపు గజాల ఫ్లాట్లు	336
430 చదరపు గజాల ఫ్లాట్లు	432
ములగాడలో..	
300 చదరపు గజాల ఫ్లాట్లు	48
365 చదరపు గజాల ఫ్లాట్లు	96
430 చదరపు గజాల ఫ్లాట్లు	182
అచ్చంనాయుడులోవలో..	
430 చదరపు గజాల ఫ్లాట్లు	1344
430 చదరపు గజాల ఫ్లాట్లు	624
430 చదరపు గజాల ఫ్లాట్లు	2016



ములగాడ వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టిడ్కో ఇళ్లు

సదుపాయాలు కల్పించారు. చాలా మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. నీటి సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ వైరింగ్ పనులు పూర్తి చేశారు. గృహ ప్రవేశాల తరువాత వ్యక్తిగత మీటర్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవలసి ఉంది. ఇందు కోసం విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయం కార్యదర్శుల సహకారంతో ప్రత్యేక శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

పుణ్యకార్యంగా భావిస్తున్నా..



టిడ్కో గృహ ప్రవేశాల పండగలో పాలుపంచుకోవడం పుణ్యకార్యంగా భావిస్తున్నా. పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉంది. గృహ ప్రవేశాలు పండగలా జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్‌లోని సామాజిక భవనంలో వార్డు కార్పొరేటర్ పూర్ణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను గురువారం ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వంట ఇంటికే పరిమితం కాకూడదన్నారు. మీకంటూ మంచి గుర్తింపు తెచ్చుకునే విధంగా మహిళలు అడుగులు వేయాలన్నారు.మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. మహిళల సంక్షేమానికి ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, నాయకులు కాకి గౌరిరెడ్డి,గాలి సన్యాసిరావు,రాజశేఖర్,సంపత్,సరోజిని,అమరావతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



మృతుడు ధనాల శంఖర్



మృతుడు బంధువులను ఓదార్చుతున్న పత్నిరావు


మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో విధులకు వెళ్లిన ఓ కాంట్రాక్ట్ కార్మికుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వివరాలు.. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన ధనాల శంకర్ (35) హెచ్‌పీసీఎల్‌లో మనోజ్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే రోజూ మాదిరిగా గురువారం విధులకు వెళ్లిన శంకర్ సాయంత్రం నాలుగున్నర సమయంలో పని చేస్తున్న ప్రదేశం వద్ద ఒక్కసారిగా కుప్పకూలాడు.దీంతో తోటి కార్మికులు విషయాన్ని అధికారులకు వివరించి అంబులెన్స్ సాయంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు.అయితే శంకర్ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

దీంతో సాయం అందించాలని అతడి కుటుంబ సభ్యులు నినదించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పత్నిరావు మృతుని బంధువుల వద్ద వెళ్లి ఓదార్చారు.హెచ్‌పీసీఎల్ నుంచి,సదరు కాంట్రాక్టర్ నుంచి సాయం అందించే విధంగా అధికారులతో మాట్లాడుతానని భరోసా కల్పించారు. దీనిపై మల్కాపురం పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, చక్రవర్తి తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో జరుగుతున్న సీతరామాలయ 21 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం శ్రీమద్రామాయణ సామూహిక పారాయణ నిర్వహించారు. సాయంత్రం సింహపురికాలనీ నిర్వాసితురాలు రాజ్యలక్ష్మి బృందంచే కోలాట ప్రదర్శన అద్భుతంగా సాగింది. భక్తులు సీతరాములను దర్శించుకుని పూజలు చేశారు.

వేడుకగా ఆలయ ప్రారంభోత్సవం

- భక్తిశ్రద్ధలతో కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట
- పూజల్లో పాల్గొన్న ఆనంద్ కుమార్



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వార్డు కాకాని నగర్(కనక మహాలక్ష్మి నగర్)లో గురువారం కనకమహాలక్ష్మి ఆలయం ప్రారంభోత్సవం అత్యంత కోలాహలంగా జరిగింది. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ శుభ ముహూర్తాన వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలసి కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. పరిసర కాలనీల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన హోమంలో ఆనంద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మ్మవారిని ప్రార్థించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 90వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు చుక్కా ప్రసాదడ్డి, నమ్మి శ్రీను, వెంకటేశ్వరరావు, రామకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు డీటీ నాయుడు, కృష్ణ నాగు, పెద్ది నాయుడు, రాంప్రసాద్, సోమేశ్వరరావు, నారాయణ రావు, గోపాలరావు, కుమార్, సర్వేశ్వరరావు, శేషగిరిరావు, సుందర్, ప్రసాద్, అనురాధ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు వలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని వలంటీర్లను గురువారం ఘనంగా సన్మానించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, మూడు జిల్లాల వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడూలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసే ప్రతి మంచి పని, ప్రతి సంక్షేమం వలంటీర్ల ద్వారానే జరుగుతుందన్నారు. అవినీతికి తావులేకుండా, కుల మతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు వరపల మహేష్, సచివాలయ కన్వీనర్లు కొట్నాన రవి, గుండపు అశోక్, పెంట్ల బాలకృష్ణ, మీసాల సత్యనారాయణ, శరగడం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘన సత్కారం



వలంటీర్లతో ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డులకు చెందిన వలంటీర్లను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం ఘనంగా సత్కరించారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఏడు వార్డుల పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించామన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని వలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. పలు వార్డుల కార్పొరేటర్లు, ఆర్పీలు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బాబా



హారతి సేవలో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో బాబావారికి పంచామృతాలతో అభిషేకం జరిపించి, అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.సాయంత్రం బాబాకు పంచహారతులు ఇచ్చారు. భక్తులంతా సామూహికంగా సాయి సంకీర్తన ఆలపించారు. సాయి సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రత్యేక హారతులు ఇచ్చిన తర్వాత బాబా మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష

- గవరకంచరపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం
- 369 మందికి వైద్య పరీక్షలు



రోగుల సమస్య వింటున్న ప్రత్యేక అధికారి డాక్టర్ సురేష్‌కుమార్

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని జగనన్న సురక్ష ప్రోగ్రాం ప్రత్యేక అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం కమ్యూనిటీ హాల్‌లో గురువారం జ్ఞానాపురం వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షిత నేతృత్వంలో వైద్యాధికారులు రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్రతి సంక్షేమ పథకం ప్రజల ముంగిటకే అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సత్ఫలితాలు సాధించారన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. సుమారు 369 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్ కుమార్, హెచ్ఎస్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్ఎస్ శరత్, టీబీహెచ్‌వీ పైడిరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

మంచి వైద్యం అందించారు



రోగంతో పలు ఆస్పత్రులు చుట్టూ తిరిగేదాన్ని. అయినా నయం కాలేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వలంటీర్ సాయంతో ఏఎన్ఎం, ఆశవర్కర్ పేరు నమోదు చేశారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నాను. మంచి వైద్యం అందించారు.

– చిన్నమ్మలు, గవర కంచరపాలెం,

సేవలు బాగున్నాయి



గతంలో ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ప్రైవేటు ఆస్పత్రులకు తిరిగేదాన్ని. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నేడు మా ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయడం చాలా ఆనందంగా ఉంది. మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు.

–సంతోషికుమారి, దయానందనగర్

మంచి స్పందన



మురికివాడ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మొదటి, రెండో విడత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రత్యేక వైద్యనిపుణులచే వైద్యపరీక్షలు, ఉచితంగా మందులు అందిస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పించడంతో మంచి స్పందన వస్తోంది.

–డాక్టర్ హర్షిత, వైద్యాధికారి, జ్ఞానాపురం, యూపీహెచ్‌సీ

విశాఖ పీఠాధిపతిగా రెవరెండ్ ఫాదర్ జయరావ్

- బిషప్ మల్లవరపు ప్రకాష్‌కు ఘన వీడ్కోలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి మైదానంలో గురువారం విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో నూతన అపోస్టోలిక్ పాలనాధికారి విశాఖ పీఠాధిపతిగా రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పాలిమేర జయరావ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం వీధుల్లో మేళతాళాలతో అతిథులను వేడుకగా ఊరేగించారు. అనంతరం డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు కృతజ్ఞత పూజాబలి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నల్గొండ బిషప్ రెవరెండ్ ఫాదర్ కరణం ధమన్‌కుమార్, ఫాదర్లు మల్లెల జోజి, జొన్నాడ జాన్‌ప్రకాష్, బాలశౌరీ, చిటికెల రాజకుమార్, ఆర్జీ ప్రకాష్, జోసెఫ్ ప్రభాకర్, సిస్టర్లు శాండ్రిస్, రోస్ జోస్ దివ్యబలి పూజలు చేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు వీడ్కోలు పలికి, నూతన బిషప్ జయరామ్‌కు స్వాగత పుష్పాలతో అభినందించారు, కార్యక్రమంలో పీపీసీ అధ్యక్షుడు రాజేష్, ఏఐసీయూ అధ్యక్షుడు బూర రవీంద్ర శేషుబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.